నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 2 మే 2025 | VIKARABAD

ధారూరు మండలం నాగారం గ్రామంలో ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రంలో సంచులను కుడుతున్న రైతు

కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు..

కొడంగల్ : నాచారం రైస్ మిల్ వద్ద ధాన్యం బస్తాలతో బారులు తీరిన ట్రాక్టర్‌లు

- రైతులను భయపెడుతున్న అకాల వర్షాలు.. ఈదురుగాలులు
- వర్షాలకు తడిసి ముద్దవుతున్న వడ్లు
- పొలాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కేవలం 40 కేంద్రాల్లోనే సేకరణ షురూ
- దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు
- తరుగు, తేమ శాతం పేరిట దోపిడీ
- వికారాబాద్ జిల్లాలో 92 వేల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 73 వేల ఎకరాల్లో సాగైన వరి
- వికారాబాద్ జిల్లాలో 2.25 లక్షల మెట్రిక్ టన్నులు, రంగారెడ్డి జిల్లాలో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా

రంగారెడ్డి జిల్లాలో సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో కొనుగోలు లక్ష్యం 20 వేల మెట్రిక్ టన్నులుగా నిర్ధారించగా.. ఇప్పటివరకు 500 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసింది. 80 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం రైతుల చేతికి రాగా.. ఎక్కువ శాతం మధ్య దళారులకే విక్రయించారు. వికారాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 226 మంది రైతుల నుంచి రూ.2.57 కోట్ల విలువైన 10,832 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఇంకా ఒక్క రైతుకు కూడా నయా పైసా చెల్లింపులు చేయకపోవడం గమనార్హం. మధ్య దళారులు కల్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులు వారికే విక్రయిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల లక్ష్యం నెరవేరటం లేదనే ఆరోపణలొస్తున్నాయి.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాలు., వికారాబాద్ జిల్లావ్యాప్తంగా బొంరాస్‌పేట్ మండలంలో 4, దోమ మండలంలో 5, దౌల్తాబాద్ మండలంలో 4, కొడంగల్‌లో 5, పరిగి మండలంలో ఒకటి, యాలాల మండలంలో ఒక కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతానికి ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమయ్యింది. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వదిలేయడంతో రైతులు అకాల వర్షాల భయానికి తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్నారు. వరి సాగు చేసిన రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద గత వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితులుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పటికీ ఎందుకు కొనుగోలు చేయడం లేదని రైతులు అధికారులను నిలదీస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకుండానే నేరుగా సంబంధిత రైస్ మిల్లులకు ధాన్యాన్ని పంపిస్తూ అక్కడే కాంటా వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

తరుగు పేరిట దోపిడీ

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురుచూసి పూర్తిగా నష్టపోకుండా దళారులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు తరుగు పేరిట కిలోల కొద్దీ రైతులు పండించిన ధాన్యం నుంచి కొట్టేయడం, తేమ శాతం అధికంగా ఉందంటూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 50 కిలోల బస్తాలో 5 కిలోల వరకు తరుగు తీస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు 10 కిలోల వరకు ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడీ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే కొర్రీలు పెడుతూ నష్టం కలిగిస్తుండడంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేందాల్లో జరుగుతున్న అవకతవకలతోపాటు సమస్యలపై జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లాలోని మెజార్టీ రైతులంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాకుండా ప్రైవేట్ మార్కెట్‌కే ధాన్యాన్ని తరలిస్తున్నారు.

మద్దతు ధర నిర్ణయించిన సర్కారు

యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 128 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించగా.. ఐకేపీ ద్వారా 41, పీఏసీఎస్ ద్వారా 49, డీసీఎంఎస్ ద్వారా 38 కొనుగోలు కేంద్రాలను సర్కారు ఏర్పాటు చేయనున్నది. వీటిలో సన్న రకం వడ్లను కొనుగోలు చేసేందుకు 11 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. రైతులకు అందించే మద్దతు ధరకు సంబంధించి క్వింటాలుకు ఏ గ్రేడ్ రూ.2320, సాధారణ రకం క్వింటాలుకు రూ.2300లుగా ప్రభుత్వం నిర్ణయించింది.

భయాందోళనలో అన్నదాతలు

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం అకాల వర్షాలతో ఎక్కడ పాడవుతుందోనని రైతులు భయాందోళనలో ఉన్నారు. ఓవైపు ప్రభుత్వం ప్రతి చివరి గింజ వరకు రైతుల నుంచి వడ్లు కొంటామని ప్రకటిస్తున్నా, ఆచరణలో వచ్చేసరికి అలా జరగడం లేదనే విమర్శలున్నాయి. ఓవైపు వరి కోతలు జరిగి వడ్లు ఎండబెట్టిన తర్వాత సైతం అధికారులు బస్తాలు ఇవ్వడం లేదని, లేదంటే రైస్ మిల్లు దగ్గరికే వెళ్లాలని సూచిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. మరికొంత మంది రైతులు వరికోతలు చేపడుతున్నారు. పలువురు రైతులు తమ వ్యవసాయ పొలాల్లోనే వడ్లు ఆరబెడుతున్నారు. సంచి బాజు కిలో, కాంట బాజు కిలో, తాలు పేరిట మరో కిలో చొప్పున 50 కిలోల బస్తాకు మూడు కిలోలు తరుగు తీస్తారని, ఈ లెక్కన క్వింటాలుకు 6 కిలోలు తరుగు తీస్తున్నట్లు రైతులు మండిపడుతున్నారు. రైస్ మిల్లర్లు, ప్రభుత్వ అధికారుల కుమ్మక్కుతోనే ఈ దోపిడీ జరుగుతున్నదని ఆరోపిస్తున్నారు. అమ్మితే అమ్మండి.. లేకుంటే వెళ్లండి.. అన్నట్లుగా పరిస్థితి కొనసాగతున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి తక్కువగా ఉందని ఓ పక్క బాధపడుతుంటే, మరో పక్క రైస్ మిల్లర్ల దోపిడీతో నిండా మునిగిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి జరుగుతున్న తూకం దోపిడీలను నివారించాలని కోరుతున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతాంగం ఈదురుగాలులు, అకాల వర్షాలతో దినదినగండంగా గడుపుతున్నారు. ఓవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుల విషయంలో అన్నింటి లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వరి కోతకు వచ్చిన సమయంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్య సేకరణ ప్రక్రియ జరిగేది. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులు వరి కోతలు పూర్తి చేసి గత వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడంలో మాత్రం ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నది. దీంతో చాలా మంది రైతులు నష్టపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 92 వేల ఎకరాల్లో వరి పంట సాగు కాగా, 2.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి., రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 73 వేల ఎకరాల్లో వరి పంట సాగు కాగా.. 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభం కాకపోవడంతో తక్కువ ధరకే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ రైతులు నష్టపోతున్నారు. తరుగు, తేమ శాతం పేరిట దళారులు దోచుకుంటున్నారు.

- రంగారెడ్డి/వికారాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ)

ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం ఎదురు చూస్తున్నాం

నాగారంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం ఎదురు చూస్తున్నాం. గత నాలుగైదు రోజులుగా గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నాం. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాన్ని త్వరగా ప్రారంభించి కొనుగోలు చేయాలి. ఆలస్యం చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉదయం పూట ఆరబెడుతుండగా.. సాయంత్రం వర్షాలు కురుస్తాయేమోనని భయంగా ఉన్నది. ధాన్యం అమ్మిన డబ్బులు తాడిపత్రి కొనడానికి మాత్రమే సరిపోతున్నాయి. మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేయాలి.

-సి.అంజిలయ్య నాగారం, ధారూరు మండలం

ధాన్యం కొనుగోలు చేయడంలేదు

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా కొనుగోలు చేయడం లేదు. గన్నీ బ్యాగులు కోసం టోకెన్లు ఇచ్చారు కాని ఇప్పటివరకు బ్యాగులు ఇవ్వలేదు. ఈ రోజు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారు. తాండూరులోని డీసీఎంఎస్ కార్యాలయంలో వచ్చే సోమవారం నుంచి బ్యాగులు ఇస్తామని చెప్పారు. ఇటీవల వర్షానికి ధాన్యం తడిసిపోగా ఆరబెడుతున్నాం. ఈ లోపు మళ్లీ వర్షం పడితే ఏమి చేయాలో అర్థం కావడంలేదు. అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

- లాలప్ప, రైతు, చెంగోల్, తాండూరు మండలం

కొనేవారు లేరు

వరి కోతలు పూర్తి కావస్తున్నా మా గ్రామంలో వడ్లు కొనడంలేదు. ఓవైపు బోర్లలో నీరు తగ్గి దిగుబడులపై ప్రభావం చూపింది. మరోవైపు ఎప్పుడు వాన వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అకాల వర్షాలు, గాలి దుమారంతో వడ్లను కాపాడుకోవాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పొలం దగ్గరే వడ్లు ఆరబెడుతున్నాం. ప్రతిసారి రైస్‌మిల్లర్లు బస్తాకు మూడు కిలోలు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారు. ఈసారి వరి కోతలు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు గ్రామం నుంచి వడ్లు కొంటలేరు. రైస్ మిల్లు దగ్గరకు వెళ్తే రైతును దోచుకుంటున్నా అడిగేవారు లేరు.

- కోట్ల మహిపాల్, రూప్‌ఖాన్‌పేట్, పరిగి మండలం

తూకం నేరుగా మిల్లర్ల వద్దనే..

పండించుకున్న పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. అప్పట్లో కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసి చీటీ ఇచ్చేవారు. కొనుగోలు కేంద్రం వరకే ధాన్యాన్ని తరలించే పరిస్థితి ఉండేది. కానీ నేడు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే.. తేమను పరిశీలించుకొని పంటను ఎండబెట్టుకొని బస్తాలు కుట్టుకొని వారు చెప్పిన రైస్ మిల్‌కు ధాన్యాన్ని తీసుకుపోతున్నాం. అక్కడ మా రైతుల పాట్లు మరో రకంగా ఉన్నాయి. మిల్లర్లు తూకంలో 50 కిలోల బస్తాకుగాను ఏకంగా రెండు కిలోల తరుగు తీస్తున్నారు. చేసేదేమీ లేక వచ్చినంతకే పంటను అమ్ముకొంటున్నాం.

- జగ్గప్ప, రైతు, పాత కొడంగల్

తాండూరురూరల్ : చెంగోల్ వరి కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

మొదట్లో చిరిగిన బస్తాలు వచ్చాయి

మొదట్లో కొనుగోలు కేంద్రానికి చాలా వరకు చిరిగిన సంచులే సరఫరా అయ్యాయి. అధికారులు పంపించిన బస్తాలనే రైతులకు అందించాం. ఆ తరువాత రెండోసారి వచ్చిన బస్తాలు చాలా వరకు మేలు. ప్రస్తుతం వాటినే రైతులకు ఇస్తున్నాం. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడానికి కూలీలు లభించడంలేదు. తద్వారా నేరుగా ధాన్యం బస్తాలను రైస్ మిల్‌కు తరలిస్తున్నాం. పెద్దనందిగామ కొనుగోలు కేంద్రానికి పందుల బెడద అధికంగా ఉన్నది. అందుకే వచ్చిన ధాన్యాన్ని త్వరగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- బాలకృష్ణ, కొనుగోలు కేంద్ర నిర్వాహక సిబ్బంది, పెద్దనందిగామ

పదిహేను రోజులు గడిస్తే బయటపడతాం

పంట నోటికాడికొచ్చింది. పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు, గాలి వానలు తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి పంటలు సాగు చేస్తే రాళ్లవాన వలన నేలపాలవుతున్నాయి. పెట్టుబడి సాయంతో పాటు పంటల బీమా ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ సర్కారు.. దాని ఊసే ఎత్తడంలేదు. అకాల వర్షాల వలన తీవ్ర నష్టాలు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- హన్మంత్‌రెడ్డి, చర్లపటేల్‌గూడ

నెలకోసారి ఆగుడే..

- సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్న మెట్రో
- అధునాతన సాంకేతికత ఉన్నా సేవలకు అంతరాయం

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : పేరుకే ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం.. కానీ నిర్వహణ లోపంతో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు మెట్రో ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఆఫీసులు, ఇండ్లకు చేరుకునేందుకు, ట్రాఫిక్ సమస్యల నుంచి బయటపడాలని మెట్రోలో ప్రయాణిస్తే ఎప్పుడు ఆగిపోతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటున్నది. దేశంలోనే సమర్థవంతమైన మెట్రో వ్యవస్థగా గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్ మెట్రోకు ఇప్పుడు తలవంపులు తప్పడంలేదు. ఎల్‌అండ్‌టీ నిర్వహణ లోపమో.. లేక అధికారుల పర్యవేక్షణ వైఫల్యమో తెలియదు కానీ ప్రయాణికులు మాత్రం భయాందోళనకు గురవుతున్నారు.

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నది. నెలకోసారి ఏదో ఒక మార్గంలో ఒక్కసారిగా నిలిచిపోవడంతో జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లే, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయంలోనే మెట్రో రాకపోకలకు కలుగుతున్న అంతరాయం తీవ్ర ప్రభావం చూపుతున్నది. గురువారం అమీర్‌పేట–మియాపూర్ మార్గంలో మొరాయించిన మెట్రోతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. 20 నిమిషాలపాటు రాకపోకలు నిలిచిపోగా, ఆ మార్గంలో మిగతా సర్వీస్‌లకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎల్బీనగర్–మియాపూర్ మార్గంలో రద్దీ సమయంలో మెట్రోలో తలెత్తిన సాంకేతిక సమస్యతో భరత్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో బోగీల్లో ఉండి అరగంటకుపైగా ప్రయాణికులు ఎదురు చూశారు.

పడకేసిన నిర్వహణ

సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామని చెబుతున్నా.. మెట్రోకు నిత్యం ఎదురయ్యే టెక్నికల్ సమస్యలతో హెచ్ఎంఆర్ఎల్ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. తరచూ ఆకస్మిక నిలిపివేతలతో ప్రయాణికులు భయపడిపోతున్నారు. ముఖ్యంగా పీక్ అవర్‌లో సిగ్నలింగ్ వ్యవస్థలో తలెతుతున్న సాంకేతిక లోపాలతో బోగీల్లో ప్రయాణికులు బంధీ అవుతున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థలో కరెంట్ సరఫరా అంతరాయం, ప్యాసింజర్ లోడ్ అధికంగా ఉండటంతో ఎప్పుడు నిలిచిపోతుందో కూడా తెలియని పరిస్థితి ఉంది. అసలే ఎండాకాలం కావడంతో ఉక్కపోత, అధిక వేడి, ట్రాఫిక్ సమస్యలను నుంచి బయటపడేందుకు మెట్రోలో ప్రయాణించేవారి సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంతోపాటు, మధ్యాహ్నం కూడా మెట్రో రద్దీ కొనసాగుతున్నది.

తరచూ అంతరాయం

ఏడాది కాలంగా నగరంలో అనేకసార్లు మెట్రో సేవల్లో అంతరాయం ఏర్పడింది. గతేడాది మార్చి 27న నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్తున్న మెట్రో సర్వీసు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద నిలిచిపోగా 15 నిమిషాల పాటు సేవలు ఆగిపోయాయి. జూన్ నెలలో మెట్రో ఫ్రీక్వెన్సీ పెంచగా వచ్చిన టెక్నికల్ సమస్యలతో ఆగిపోగా ప్రయాణికులు ఎమర్జెన్సీ డోర్ల నుంచి బయటపడ్డారు. నవంబర్ 11న తలెత్తిన టెక్నికల్ సమస్యలతో ఏకంగా అన్ని రూట్లలో రైళ్లు రాకపోకలు నిలిచిపోయాయి. డిసెంబర్ నెలలోనూ లక్డీకాపూల్, మలక్‌పేట వద్ద టెక్నికల్ సమస్యల కారణంగా ఆగగా, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన సమస్యలతో ఏకంగా రెండున్నర గంటల పాటు మెట్రో సేవలు నిలిచాయి. ఏడాది ఏప్రిల్ 3న కూడా ఎల్బీనగర్–మియాపూర్ మార్గంలో నాంపల్లి వద్ద ఒక్కసారిగా మెట్రో ఆగిపోగా 20 నిమిషాల పాటు మెట్రో బండి ఎటూ కదలకుండా ఉండిపోయింది. తరచూ వస్తున్న సాంకేతిక సమస్యలతో మెట్రో రైలు పరిజ్ఞానంపై అనుమానాలు కలుగుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడితో నాయకులు, కార్యకర్తల వాగ్వాదం

జెండా మోసినవారికే మొండిచెయ్యి..!

- కొత్తగా వచ్చినవారికి నామినేటెడ్ పోస్టులు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో కార్యకర్తల ఆవేదన

రంగారెడ్డి, మే 1 (నమస్తే తెలంగాణ) : సంస్థాగత మార్పులు, వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం వంటి అంశాలపై గురువారం శంషాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశం గందరగోళంగా సాగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఏఐసీసీ పరిశీలకుడు వంశీచందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శివసేనారెడ్డి, మధుయాష్కీ గౌడ్, జిల్లా ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలోనే కార్యకర్తల మనోభావాలు తెలపాలని కోరడంతో పలువురు కార్యకర్తలు మూకుమ్మడిగా తమకు న్యాయం జరగడంలేదని ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీలో జెండా మోసినవారికే గుర్తింపు దక్కడంలేదని, కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పోస్టులు కూడా ఇస్తున్నారన్నారు. తాను 44 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నానని, ఆలయ కమిటీలో నామినేటెడ్ డైరెక్టర్ అయినా ఇవ్వాలని కోరగా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఓ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశాడు. పార్టీలోకి కొత్తగా ఎమ్మెల్యేలు, మరికొంత మందిని చేర్చుకుని వారి అనుచరులకు మాత్రమే పదవులు ఇప్పిస్తున్నారని, పాతవారికి ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. నమ్ముకున్న నాయకులు కూడా పట్టించుకోకపోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పార్టీని నమ్ముకుని ఎన్నో ఇబ్బందులకు గురైనా నిలదొక్కుకున్నవారికి సముచితస్థానం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని నామినేటెడ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి పార్టీ కోసం కష్టపడి జెండా మోసినవారికి అవకాశం కల్పించాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కార్యకర్తలను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మైక్ తీసుకుని సద్దిచెప్పే ప్రయత్నంలో కార్యకర్తలకు, ఆయనకు వాగ్వాదం కూడా జరిగింది. ఏఐసీసీ పరిశీలకుడు వంశీచందర్‌రెడ్డి కల్పించుకుని కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామని త్వరలోనే గ్రామ, మండల, జిల్లాస్థాయితో పాటు పార్టీ అనుబంధ విభాగాలన్నింటికీ కొత్తగా పదవులు వస్తాయని.. వాటిలో అందరికీ ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలంటూ ఇబ్రహీంపట్నంకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఆరేండ్లలోపూ అద్దాలే!

36 అంగన్‌వాడీ కేంద్రాల్లో 113 మంది పిల్లలకు కంటి సమస్యలు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): చిరునవ్వులు చిందించాల్సిన బాల్యం కంటి సమస్యలతో సతమతమవుతున్నది. జిల్లాలోని వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆరు నెలల వయస్సు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ మొదటివారంలో ప్రారంభించిన ఈ సర్వేలో రెండు వైద్యబృందాలుగా ఏర్పడి 36 అంగన్‌వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4020 మంది చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 20 మందికి అద్దాలు అవసరమవుతున్నాయి. వివిధ రకాల కంటి సమస్యలతో 53 మంది, కంటి తిప్పుకుపోవడం సమస్యతో 13 మంది, కంటి పైరెప్ప వాలిపోవడం సమస్యతో ఇద్దరు, విటమిన్ ఏ లోపంతో వచ్చే గాయాలతో 29 మంది, మైయోఫియాతో ఆరుగురు, చూపు మసకబారి ముగ్గురు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దాలు అవసరమైన చిన్నారులందరికీ ఉచితంగా కంటి అద్దాలు, మందులు ఆరోగ్యశాఖ అందించనున్నది.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడంలో సిబ్బంది కొరత వెంటాడుతున్నది. జిల్లాలో 28 మంది పీఎంఓ వైద్యులు అవసరం ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ప్రస్తుతం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ఆరేళ్లలోపు చిన్నారులకు మూడు నెలల్లోనే కంటి పరీక్షలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది కొరతతో వైద్యాధికారులు ఆలోచనలో పడ్డారు. మరోవైపు మే నెలలో ఎండల తీవ్రత కారణంగా నెలరోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో చిన్నారులంతా సెంటర్లకు రాకుండా ఇంటి పట్టునే ఉండటంతో స్క్రీనింగ్ పరీక్షలకు బ్రేక్ పడింది. తిరిగి జూన్ నెలలో సెంటర్లు ప్రారంభంకాగానే టెస్టులు మొదలుపెట్టనున్నారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే నిర్వహిస్తున్న ఈ స్క్రీనింగ్‌లో జిల్లాలోని 917 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులు పాల్గొననున్నారు. 6 నెలల నుంచి 2 ఏళ్లలోపు చిన్నారులు 22,067, రెండేళ్ల నుంచి మూడేళ్లవారు 34,521, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సువరు 48,904 మంది స్క్రీనింగ్ పరీక్షల్లో పాల్గొననున్నారు. ఇప్పటివరకు 36 కేంద్రాల్లో 4020 మంది చిన్నారులకు కంటి పరీక్షలు పూర్తి చేయగా, ఇంకా 881 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నది.